# జీవిత సాఫల్యం

సీరియస్‌గా పని చేసుకుంటూ ఉంటే ప్యూను వచ్చి ఓ సర్క్యులర్ చేతికిచ్చాడు. ఏముందని చూశాడు రామ్మూర్తి. అందరూ దానం చేస్తున్నారు. కనిష్టం యాభైరూపాయలు రాశారు. తక్కువ జీతం పొందే ఉద్యోగులు కొంచెం హోదా గలిగిన వాళ్ళు నూరునుండి ఇన్నూట పదహార్లు రాశారు తమవంతు వితరంగా.

ఆ ఆఫీసుకు రామ్మూర్తి కొత్తగా బదిలీమీద వచ్చాడు. వచ్చి యింకా నెల పూర్తి కాలేదు. అందుకే విసుగ్గా ఆ కుర్రాడిని అడిగాడు " ఏంటిది? ఈ సర్క్యులరేంటి? ఈ డొనేషన్లేంటి? ఏంటి ఈ న్యూసెన్సు?"

" ప్రతి నెలా మనవాళ్ళు యిస్తూ ఉంటారు. ఇవ్వాళ ఏమీ కొత్తకాదు. మీకు తోచినంత యివ్వవచ్చు సార్ !" చెప్పాడు శీను.

" ఓ పది రూపాయలు రాసుకో!" నిర్లక్ష్యంగా అన్నాడు రామ్మూర్తి.

" క్లాసు ఫోర్ వాళ్ళే యాభై తక్కువ కాకుండా యిస్తూ ఉంటే తమరు క్లాసు వన్ ఆఫీసరై ఉండి పది యిస్తే పరువు పోతుందేమో సార్ ఆలోచించండి" శీను నవ్వుతూ అన్నా అతనికి కారం రాసినట్లైంది.

తన హోదా గుర్తుకొచ్చి - బలవంతాన జేబులోంచి వంద తీసిచ్చి ఆ సర్క్యులర్‌లో తన పేరు ఎదురుగా అమౌంటు రాసి, పెయిడని సంతకం పెట్టాడు.

శీను తలాడించి ఆ వంద తీసుకొని వెళ్ళిపోయాడు నిర్లక్ష్యంగా.

రామ్మూర్తి పేరుకు ఆఫీసరేగాని– ఆర్థికంగా ప్యూన్! అందుకే జేబులోంచి వంద పోయేసరికి దిగులుపడి పోయాడు. వందంటే మాటలా– కనీసం నాలుగు రోజులు కాలక్షేపం చెయ్యవచ్చు. పొదుపుగా వాడుకుంటే– రూపాయి ఆదాచేస్తే రూపాయి సంపాదించినట్టే గదా మరి!

లంచ్‌అవర్‌లో తనతో క్లోజుగా మూవు అయ్యే జూనియరు క్లర్క్ జానీని కలిశాడు. ఇలా డోనేషన్లు వసూలు చేయడం పట్ల తన అసంతృప్తిని తెలియపరిచాడు.

" చూడు జానీ ! ఈ కాలం ఈజీమనీ ఒక వ్యసనమైపోయింది. ప్రతొక్కడు డొనేషన్ యిమ్మని ఒక రికమెండేషను లెటరు తీసుకు వస్తాడు. మనం మొహమాటానికి పోయి యిస్తాం! దాంతో వాడి పబ్బం గడిచిపోతుంది. రొజుకొక పబ్లిక్కు ఆఫీసుకు పోయినా చందాలు వసూలు చేసేవాడు మనకంటే రాజులా బ్రతకచ్చు. అడుక్కుతినడంలో యిదొక హైటెక్ బెగ్గింగ్ మెథడ్!" నవ్వాడు రామ్మూర్తి.

" అస్సలు ఈ దానధర్మాలవలనే మన దేశంలో సోమరితనం పెరిగిపోతున్నది. ఈ టైపు బెగ్గింగ్ ఫారిన్‌లో లేదు." తనే అన్నాడు రామ్మూర్తి.

జానీ వంతకలుపుతాడని ఆశించాడు.

కాని జానీ మొహం కొంత జేవురించింది.

" మీ కిష్టం లేకపోతే డొనేషన్ యివ్వకుండా ఉండాల్సింది" అన్నాడు జాని.

" అదెలా ! అందరూ యిస్తూ ఉంటే తప్పదుగా?" నసిగాడు రామ్మూర్తి.

" కంపల్సరీ కాదు. అందరి పేర్లు రాసినా యిష్టం లేని వాళ్ళు యివ్వకపోతే ఎవరూ అడగరు యివ్వలేదేమని" జానీ చెప్పాడు.

" అలా అని కాదు. మనం యిచ్చిన డొనేషన్‌లు సక్రమంగా వినియోగ మవుతాయో లేదా అని నా అనుమానం" చెప్పాడు రామ్మూర్తి.

" మనం మంచిమనసుతో యిచ్చినప్పుడు అవన్నీ ఎందుకాలోచించాలి?"

అదీ నిజమే, కాని ప్రస్తుతం సమాజంలో వున్న పరిస్థితులు చూస్తూ ఉంటే అనుమానం వస్తూ ఉంది. చలికాలం వస్తే చాలు అందరూ అయప్ప స్వామి డ్రస్సులు వేసుకొని చేతిలో బొచ్చెలు పట్టుకుని బయలు దేరతారు. మూడేళ్ళ పిల్లాళ్ళ దగ్గర్నుండీ ఈ డ్రస్సు వేసి అడుక్కోవడాలు అలవాటు చేస్తున్నారు. బాధగా చెప్పాడు రామ్మూర్తి. " ఇలా అడుక్కున్న వాళ్ళల్లో ఎంతమంది స్వామి భక్తులు? ఎంత డబ్బు స్వామి కార్యానికి ఉపయోగపడుతుంది? ఎంత డబ్బు స్వకార్యానికి ఉపయోగపడుతుంది?"

" నిజమే రామ్మూర్తి సార్ ! కాని అందరినీ ఓకే గాటన కట్టి వేయడం మంచిది కాదు. మనం డొనేట్ చేస్తుంది పెద్ద ప్రొఫెసర్‌గా రిటైరైన దయానిధి గార్కి బాగా చదువుకున్నాయన బాగా చదువు చెప్పే ఆయన- విద్యాదానకర్త" జానీ వివరణ.

రామ్మూర్తికి ఆశ్చర్యం కలిగింది. నమ్మలేక పోయాడు "ఏంటి ఏంటి" ప్రొఫెసరుకు ఏం తక్కువయ్యా! ఒకవేళ రిటైరైనా బ్రహ్మాండంగా పెన్షన్ వస్తుంది గదయ్యా! పైగా సర్వీసులో ఉన్నప్పుడు బాగా వెనకేసుకొనే ఉంటాడు గదా! తనదంతా బ్యాంకులో వేసుకొని ప్రజల డబ్బుతో పుణ్యం కొనుక్కుంటున్నాడు. ఈసారి యివ్వను" రామ్మూర్తి కొంచెం నిష్ఠూరంగా.

" ఈసారి ఆయన మన ఆఫీసుకొస్తే పరిచయం చేస్తాను." జానీ చెప్పి వెళ్ళిపోయాడు  ఆటాపిక్ యిష్టంలేనట్లు.

సదరు దయానిధి ఆఫీసుకు రాకుండానే మూడు నెలలు గడిచిపోయాయి. ఈ మూడు నెలల్లో మూడు సార్లు గొప్పలకోసమో మొహమాటం కోసమో రామ్మూర్తి

ఏడ్చుకుంటూనే డొనేషన్ చేయవలసి వచ్చింది. మరి ఆ లిస్టులో ఎవరూ యివ్వకుండా ఉండటం లేదు.

దయానిధి ఎదురుపడితే ఉతికిపారేద్దామన్నంత కోపంగా ఉంది రామ్మూర్తికి. ఈ పబ్లిక్కు ఆఫీసుల్లో డొనేషన్ల కోసం చాలామంది వస్తూ ఉంటారు. ఊళ్ళో ఏవన్నా కార్యక్రమాలు జరిగినా ఏ యూనియన్ వాళ్ళనూ ఏదన్నా ఉత్సవం జరిపినా – పండుగలు పబ్బాలకు – రాజకీయకార్యకలాపాలకు – ఏదో ఒక లింకుతో నెలకు మూడు నాలుగు సార్లు డొనేషన్ల కార్యక్రమం జరుగుతుంది.

ఓ రోజు రామ్మూర్తి దగ్గరికి ఓ మాసిపోయిన గడ్డంతో చినిగిన దుస్తులతో – రేగిన జుట్టుతో – మొహంలో నెత్తురు చుక్కలేకుండా అలసిపోయిన ఓ పెద్దమనిషి (వృద్ధులను ఈ ప్రాంతంలో అలా పిలుస్తారట) వచ్చాడు.

" ఎవరు కావాలి? ఏం కావాలి!" చిరాగ్గా అడిగాడు రామ్మూర్తి.

" రామ్మూర్తి సారున్నారా? ఆఫీసరు!" అతను అడిగాడు వినయంగా.

" ఆ ! నేనే !" ఎదురుగా కుర్చీ వున్నా కూర్చోమనకుండా చెప్పాడు. అతను ఓపిక లేనట్లు కుర్చీలో కూర్చున్నాడు. మంచి నీళ్ళు కావాలని సైగ చేశాడు. ప్యూను ఓ బాటిల్లో నీళ్ల తెచ్చిచ్చాడు. అతను గటగట తాగేశాడు. కొంచెం సేద తీరాడు.

" నాతో ఏంపని?" మళ్ళీ అడిగాడు రామ్మూర్తి విసుగుదాచుకుంటూ.

" మీతో రెండు మాటలు మాట్లాడదామని" చెప్పాడు శాంతంగా.

" సారీ ! నేను బిజీ –" చీదరగా చెప్పాడు " ఇంతకీ మీరెవరు?"

" నాపేరు దయానిధి" చెప్పాడు చిన్నగా ఆ ముసలాయన.

రామ్మూర్తికి కాస్త సమయం పట్టింది ఆ పేరును గుర్తు చేసుకోవడానికి ఆ ! ప్రతినెలా తనను ఏడిపిస్తున్న పేరు అదే !

" అంటే మీరు ప్రొఫెసర్ దయానిధి?" అడిగాడు విస్మయంగా.

" ఆ ! ఒకప్పుడు ప్రొఫెసర్ని! ఇప్పుడు విశ్రాంత అచార్యుడిని." చెప్పాడు వినయంగా దయానిధి కళ్ళద్దాలు తుడుచుకుంటూ.

ఇంతలో టీ వాలా టీ తెచ్చి రామ్మూర్తి టేబుల్‌మీద ఒక కప్పు పెట్టి వెళ్ళిపోయాడు. ఆ పెద్ద మనిషి ముందు ఒంటరిగా తాగడం నామోషీ అనిపించి – టీవాలాను వెనక్కి పిలిపించి యింకో కప్పు ప్రొఫెసరుకు అందించాడు.

" థ్యాంక్సు!" అంటూ చెప్పి అతను ఆ టీని చప్పరించాడు తృప్తిగా రామ్మూర్తి కూడా టీతాగి కప్పుకిందపెట్టాడు.

" మీరు ఈ ఆఫీసుకు బదిలీ అయివచ్చి యిన్న నెలలు అయినా, మిమ్మల్ని

కల్సుకునే భాగ్యం నాకిప్పుడే కలిగింది- దయానిధి చెప్పారు. నేను మీయంత గొప్పవాడ్ని కాదు. మీకంటే వయసులో హోదాలో అన్నింటిలో చిన్నవాడిని" చెప్పాడు రామ్మూర్తి.

" మాదేముంది సార్ ! రిటైర్ అయింతర్వాత ఎవరు పట్టించుకుంటారు? బ్రతికిన రోజుల్లో ప్రొఫెసర్ని ఈ దేశంలో రిటైరైన ప్రధానికి గాని ప్రసిడెంటుకు గాని కూడా విలువ ఉంటుందని నేను అనుకోవడం లేదు. ఇంక మాలాంటి చిన్నవాళ్ళకు ఎవరు విలువ యిస్తారు!" అన్నాడు దయానిధి.

" మీరు ఏ సబ్జక్టులో ప్రొఫెసరు?" అనాసక్తిగా అడిగాడు.

" ఇంగ్లీషు లిటలేచరు ! షేక్సుపియరు పైన నన్ను అథారిటీ అమావేళ్ళు ! కీట్సు, షెల్లీ, వర్డ్సువర్త్ పోయెమ్సు చదువుతూ ఉంటే చెవులు కోసుకునేవాళ్ళు కొందరు. స్పెక్టేటర్ వ్యాసాలు చెబుతూ ఉంటే అందరూ ప్రేక్షకుల్లాగా పిన్‌డ్రాప్ సైలెన్స్‌తో వినేవాళ్ళు – ఆరోజులే వేరు" నిట్టూర్చాడు.

" ఎంత మీ వయసు?" రామ్మూర్తి అడిగాడు పరిశీలనగా చూస్తూ.

" రిటైరై ఇరవై సంవత్సరాలైంది" చెప్పాడు దయానిధి.

" అరే ! మీరు ఎనభైలో ఉన్నారా? అలా కనిపించరు!" ఆశ్చర్యంగా అన్నాడు రామ్మూర్తి అతని ఆరోగ్యాన్ని మెచ్చుకుంటూ.

ఏదో మీ అభిమానం ! వయసు ఆగుతుందా? రేపు శివరాత్రికి ఎనభైరెండు పడుతుంది. అయినా ఏదో ఒక పనిచేస్తూనే ఉన్నాగదా, అందుకని- దేవుడి దయవలన పెద్ద జబ్బులేం లేకుండా- మంచంలో పడకుండా నెట్టుకొస్తున్నా! వస్తా! మళ్ళీ కలుద్దాం!" నవ్వుతూ వెళ్ళిపోయాడు దయానిధి నడుచుకుంటూ.

కొన్ని రోజులకు మళ్ళీ శీను డొనేషను సర్క్యులర్ తెచ్చాడు. ఈ సారి స్టాపు కొంచెం ఎక్కువ రాశారు. యాభై యిచ్చేవాళ్ళు వందరాశారు. వంద యిచ్చేవాళ్ళు రెండొందలు- కేవలం దయానిధి కోసం.

" ఏం శీను ! ఈసారి రెట్టింపు చేశారు?" విసుగ్గా అడిగాడు.

" ఏం లేదు సారు ! ఈ నెలలో పెద్ద పండుగలు వస్తున్నాయి కదా! అందుకని ఖర్చులు చాలా ఎక్కువవుతాయి కాబట్టి-" శీను చెప్పాడు.

ఇష్టం లేకపోయినా స్టేటస్‌కోసం రెండొందలు సమర్పించుకున్నారు రామ్మూర్తి- మనసులో తిట్టుకుంటూ.

ఆ మధ్యాహ్నం ఆ కోపం జానీపైన చూపాడు.

" జానీ ! ఈ దయానిధికి మనం డొనేషన్లు యివ్వడమేంటి? అతనికి కొడుకులు లేరా!" కసిగా అడిగాడు.

" లేకేం సారు ! ఇద్దరున్నారు- ఒకడు ముంబైలో యింకొకడు చెన్నైలో - ఇద్దరూ సాఫ్టువేరు యింజనీర్లే" చెప్పాడు.

" మరి ఈ ముష్టిబతుకు ఎందుకు?" అడిగాడు కోపంగా.

" ఈయన ప్రిన్సిపుల్సు వాళ్ళకు నచ్చవు- వాళ్ళ ప్రిన్సిపుల్సు ఈయనకు నచ్చవు- దాంతో క్లాషు !" జానీ చెప్పాడు.

" కన్నతండ్రికి వాళ్ళు డబ్బులే పంపరా?"

" పెన్షన్ వస్తుంది గదా అంటారు వాళ్ళు !"

" అదీ నిజమే ! దిక్కులేకపోతే పంపాలి తప్పదు."

" పెన్షన్ ఏమూలకొస్తుంది అంటారు ఈయన. ఖర్చులు పెరిగిపోయాయి- నాది ఇక్ష్వాకుల కాలంనాటి పెన్షన్ - లైఫంతా టెన్షన్ అంటాడు దయానిధిగారు - ఎంత చెట్టుకంత గాలి అని వాళ్ళు అంటారు-" జానీ చెప్పాడు.

" మొత్తానికి ముసలాయనకు వాళ్ళేమీ సాయం చెయ్యరు!"

" మాతో వచ్చి ఉండు. మేం తిన్నది నీకు పెడతాం అంటారు. నాకెలా కుదురుతుంది - ఇది పుట్టి పెరిగిన ఊరు- ఈగాలిని, ఈ నేలను, ఈ మనుషుల్ని నమ్ముకున్నాను - పరాయి దేశాలకు పోలేనంటాడు ఈయన. ఈయనతోపాటు ఈయన భార్యా ఇక్కడే ఉండిపోయారు పాపం!" చెప్పాడు జాని.

" అయినా ఈ ముసలాయనకు అంత పంతమెందుకోయ్ ! హాయిగా పిల్లల దగ్గరకు పోయి ఉండవచ్చుగా ! రేపేమన్నా ఐతే ఎవరు చూస్తారు పాపం ! మనిషికి తిండే కాదుగా - తోడు ఉండాలిగా !"

" దానికి దిగులు లేదు- అది కాదు సమస్య - ఈయన పోతే ఈయనను నమ్ముకున్నవాళ్ళు ఏం కావాలన్నది ప్రశ్న! అందుకే తను యిక్కడే ఉండిపోయాడు-" జానీ చెప్పాడు.

" అంటే - ఈయనకు యిక్కడ -?"

" ఆ ! ఆయనింట్లో కనీసం ఓ పది- పదిహేనుమంది పిల్లలుంటారు. వాళ్ళకు భోజనాలు - చదువులు- మంచి చెడ్డలు ఈయన చూస్తూ ఉంటాడు" చెప్పాడు జానీ.

" అంటే ఒక అనాథాశ్రమం నెలకొల్పాడా?" రామ్మూర్తి అడిగాడు.

" ఇంచుమించు అటువంటిదే! కాని అంత ఆర్భాటాలు చెయ్యడు. తన ఇంట్లోనే కొన్ని గదులు కేటాయించి వారి మంచి చెడ్డలు చూస్తారు. తన ఆస్తి మొత్తం వారికే ఖర్చు పెడుతున్నాడు. పొలం మీద వచ్చే గుత్త కాని- పెన్షన్ డబ్బులుకాని -

ఎప్పుడన్నా ట్యుటోరియల్సు వాళ్ళిచ్చే - డబ్బులు కాని అంతా ఈ అనాథపిల్లలకీ ఖర్చుపెడుతుంటాడు." చెప్పాడు జానీ దయానిధి ఉదారగుణం గురించి.

రామ్మూర్తి తల తిరిగిపోయింది. అతనికి నమ్మలేని నిజం! అతని కుటుంబంలో యిటువంటి అనవసర ఖర్చులు అతనికి తెలియవు.

" అదికాదోయ్ ! అనాథ పిల్లలను ఆదుకొనడానికి ప్రభుత్వం ఉందిగా... వాళ్ళకోసం రకరకాల హాస్టళ్ళు చాలా చోట్ల ప్రభుత్వం నడుపుతున్నది గదా! అక్కడ చేర్పిస్తే చాలుగదా!" అడిగాడు అర్థంగాక.

" ఏమో సార్ ! తను ఎప్పుడన్నా గ్రామాలకు పోయినప్పుడు ఎవరన్నా సాయం చెయ్యమని అడిగితే వారి పిల్లలను తన దగ్గర తెచ్చుకుని వారికి విద్యాబుద్ధులు గరిపిస్తూ ఉంటాడు. కొందరు ఆయన్ని వెతుక్కుంటూ వస్తూ ఉంటారు. అటువంటి వాళ్ళను ఆయన ఎక్కడికీ పంపడు- తన దగ్గరే ఉంచుకుని సాకుతుంటాడు-" జానీ చెబుతూంటే రామ్మూర్తికి అబ్బురంగా తోచింది.

ఓ రోజు శీను వచ్చి చెప్పాడు-

" సార్ ! ఓ ఇల్లు చెపుగా వస్తున్నది కొనుక్కుంటారా?"

" ఎంత? " అడిగాడు రామ్మూర్తి.

" ఆరు లక్షలుట!" చెప్పాడు.

" అమ్మో ! అంతే !" ఆశ్చర్యంగా అడిగాడు రామ్మూర్తి.

" ఓపెన్ మార్కెట్‌లో పది దాటుతుంది సారు! వేలం పాటకు పెడితే పది పదిహేను కూడా పలుకుతుంది- కాని అప్పులు తీర్చడం కోసం అయినకాడికి అమ్మేస్తున్నారు సారు."

" ఎవరు - ఎవరిల్లు?" రామ్మూర్తి ఆసక్తిగా అడిగాడు. అతడు ఉన్నవాడు- రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టడం అతనికిష్టం కూడా.

" ఎవరిదో కాదు సార్ - ప్రొఫెసర్ దయానిధిగారిల్లు-"

రామ్మూర్తి ఉలిక్కిపడ్డాడు. బుర్ర ఖాళీ అయింది.

ఆ సాయంత్రం జానీని తీసుకుని రామ్మూర్తి దయానిధి యిల్లు చూద్దామని బయలు దేరాడు.

ఊరికి దూరంగా పదిసెంట్ల స్థలంలో మూడు సెంట్లు యిల్లు కాకుండా - కొన్ని షెడ్లులు విడిగా కట్టి ఉన్నాయి. చుట్టూతా కంచె ఆ యింట్లో పది- పదిహేను మంది చిన్న పిల్లలు- పెద్ద పిల్లలు తిరగడం కనిపించింది.

దయానిధి ఆనందంగా ఆహ్వానించాడు రామ్మూర్తిని.

" మీరు రావడం మాకు ఆనందం కలిగించింది- ఏం తీసుకుంటారు? పాలు?" దయానిధి అడిగి- అక్కడవున్నా పిల్లవాడికి పాలు పురమాయించాడు.

" మీరు చిన్న ఆశ్రమాన్ని స్థాపించినట్లున్నారు- గుడిసెలు- పిల్లలు- మీ ఓపిక మెచ్చుకునాలి!" రామ్మూర్తి.

" ఏదో నా ఛాదస్తం! ప్రొద్దున్నలేవగానే భగవద్గీత శ్లోకాలు- వ్యాయామము- అల్పాహారం - చదువులు- ఆ తర్వాత భోజనాలు- సాయంత్రం పాలు- రాత్రికి భోజనాలు చదువులు- ఓ పద్ధతిలో - సాగిపోతూ ఉంటుంది యిక్కడ. కాని ఆరోగ్యం బాగాలేక ఈ మధ్య పిల్లలమీద శ్రద్ధ తీసుకుపోలేక పోతున్నాను. అదే బాధ" సన్నగా కన్నీరు కనిపించింది. ఆయన మొహంలో. రామ్మూర్తికి బాధ కలిగింది అంత పెద్దాయన ఏడుస్తూ ఉంటే. పాలు వచ్చాయి- వద్దంటూనే తాగారు.

" ఈ యిల్లు అమ్మకానికి పెట్టారా!" అడిగాడు.

" ఆ ! ఇంక అప్పులు తీరే మార్గం కనపడలేదు."

" అప్పులు ! మీకు అప్పులు కావడం ఏమిటి? "

" బరువు బాధ్యతలు ఎకు&కవ - నాకొచ్చేవి సరిపోవు- అదీగాక ఈ మధ్య వైద్యానికి విపరీతమైన ఖర్చు అయింది-"

" ఎవరికి మీకే ! మీ పిల్లలు పంపలేదా?"

" ఉహూ ! నాకైతే పంపిస్తారు కాని- నేను సాకుతున్న పిల్లలకోసం ఎందుకు పంపుతారు? ఈ రాజాగాడికి హార్ట్ ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. గుండెలో హోలు పడిందట ! దానికి రెండు లక్షలు ఖర్చు అయ్యాయి. అలాగే దామోదరంకు యాక్సిడెంటు అయి కాళ్ళు చేతులు విరిగితే ఆపరేషన్లు చేయాల్సి వచ్చింది. దీంతో లక్షలకు లక్షలు ఖర్చయి చేతిలో చిల్లిగవ్వ లేకుండా పోయింది- సమయానికి డబ్బు సర్దుబాటు కాకపోతే ఇల్లు తాకట్టు పెట్టి వడ్డీకి డబ్బులు తెచ్చాను- వడ్డీలు కట్టలేక పోతున్నాను. అస్సలు తీర్చలేకపోతున్నాను - అప్పులిచ్చిన వాళ్ళు కోర్టులో దాఖలు చేశారు- వాళ్ళు వేలం వేసే ముందే నేను అమ్మేసి అప్పులు కట్టేస్తే పరువు నిలబడుతుందని నా ఆశ!" బాధగా చెప్పారు దయానిధి.

ఈ లోగా ఓ వ్యక్తి రెండు గుడ్డల మూటలు తెచ్చి పెట్టారు. " ఏం సైదులు అన్నీ సరిపోయాయా?" అడిగాడు దయానిధి.

" ఆ ! అందరికీ బట్టలు వాళ్ళవాళ్ళ ఆదులు పెట్టి కుట్టాను- పొరపాటు రాదు - ఈసారి సైదులో వాళ్ళ పేర్లు కూడా కుట్టాను. నాబిల్లు అయిదు వేలైంది యిప్పటికి. ఇప్పిస్తే పోతాను" సైదులు - టైలరు కావును - అడిగాడు.

" అంత లేదుగాని ప్రస్తుతానికి ఓ రెండు వేలిస్తాను- తర్వాత మిగితావి యిస్తాను" చెప్పారు అనునయంగా.

" కుదరదు స్వామి - ప్రతిసారీ మీరు బాకీ పెట్టడం అది వసూలు కావడానికి నాకు తాతలు దిగివస్తారు. ఈ సారి మా బీబి బట్టలు యివ్వద్దంది డబ్బులిస్తేనే యిమ్మంది సైదులు చెప్పాడు.

" అలా అంటే ఎలా? పండగకు వేసుకోవాలి గదా!"

" ఏమో స్వామీ- మా బాధలు కూడా మీరు గమనించాలి గదా?" సైదులు మొండికేశాడు.

" చూడండి రామ్మూర్తిగారూ ! పసి పిల్లలు పండక్కు కొత్త బట్టలు కట్టుకుంటే ఎంత ఆనందపడతారు! - ఇతను ఈ సంగతి అర్థం చేసుకోకుండా మొండికేస్తున్నాడు- మీరన్నా నచ్చచెప్పండి-" అంటూ లోపలికి పోయారు.

రామ్మూర్తి సైదులుతో కాసేపు మాట్లాడాడు కాని -వాడికి కూడా అప్పులు బాధలు జాస్తీగా ఉన్నట్లున్నాయి- వినలేదు. ఉన్నట్లుండి దయానిధి భార్య -సుగుణమ్మ గారు బయటకొచ్చారు- " సైదులు - నా ఉంగరం తీసుకో - అయినకాడికి అమ్ముకుని నీ బాకీ తీర్చుకో- ఇంకా మిగిలితే తర్వాత యిస్తాను- ఒక వేళ ఎక్కువ వస్తే -ఇంకో పండుగకు బట్టలు కుడుదువుగాని" అంటూ నిర్లప్తంగా వేలి ఉంగరం యిచ్చారు.

" అయ్యో ! పెళ్ళినాటి ఉంగరం!" గొణిగాడు ప్రొఫెసరు.

" ఏది శాశ్వతం ? మనమే కాదు - రేపు ఈ ఇల్లు కూడా మనది కాదు- ఎందుకు మమకారాలు? సైదులు తీసుకుపో" అంటూ ఆమె లోపలికి వెళ్ళిపోయరు.

" ఇల్లు ఎంత కమ్ముదామనుకున్నారు?" రామ్మూర్తి అడిగాడు.

" దీని ఖరీదు పదిపైన చేస్తుంది- కాని అవసరం నాది- అప్పు నాలుగుపైన ఉంది- కనీసం ఆరు లక్షలు వస్తే యిచ్చేద్దామనుకుంటున్నాను-" దయానిధి చెప్పారు.

" నా దగ్గర అంతలేదు- అయిదు దాకా అయితే నేను సిద్ధం - ఆలోచించండి" రామ్మూర్తి బేరం పెట్టాడు.

" అయ్యో ! చాలా నష్టపోతాను- ఆరయితే నాలుగు అప్పుతీర్చేసి - మిగిలిన రెండు లక్షలలో ఊరికి దూరంగా ఓ పదిసెంట్లు స్థలంలో గుడిసెలు వేసుకుని ఈ పిల్లల్ని పెడదామనుకుంటున్నాను" దయానిధిగారు మనసులో ఉద్దేశ్యం చెప్పారు.

" మీ యిష్టం ! వేలంపాట అంటే ఎంతకు వస్తుందో తెలీదు గదా !" అంటూ రామ్మూర్తి వచ్చేశాడు.

రెండు నెలలు గడిచిపోయాయి.

" సార్ ! రేపు ఆ యిల్లు వేలం వేస్తారట! వస్తారా!" అడిగాడు శీను.

" అచ్చిరాని యిల్లు మనకెందుకు శీను- ఆ యింట్లో ఉండి ఆ ప్రొఫెసర్ ఏం సుఖపడ్డాడు? తన సంపాదనంతా అనాథలకు ధారబోశాడు- ఎవరు తిన్నట్లు? " రామ్మూర్తి వేదాంత ధోరణిలో చెప్పాడు.

" సారు కూడా జబ్బు పడ్డారట - ఇంటిమీద బెంగ- " శీనుమనసు ఉండబట్టలేక - మరునాడు రామ్మూర్తి జానీని- శీనును తీసుకుని వేలం పాట చూద్దామని వెళ్ళాడు.

" సర్కారు పాట మూడు లక్షలు"

ఎవరో " నాలుగులక్షలు" చెప్పారు.

ఇంకెవరో ఐదు అన్నారు- ఇంకెవరో ఐదు పది అన్నారు- అలా జరుగుతూ ఉంది వేలం పాట!

చివరికి ఆరుదాకా వచ్చి ఆగిపోయింది.

" ఆరు లక్షలు ఒకటోసారి - ఆరులక్షలు రెండోసారి " అంటూ ఉండగా అక్కడికి ఒక ఆటో వచ్చి ఆగింది. దానిలోని ఓ యువకుడు కిందకు దిగాడు. తెల్లగా మెరిసిపోయి సూటుబూటులో దొరబాబులాగున్నారు. రామ్మూర్తి బిత్తరపోయి చూస్తున్నాడు.

" సారీ ! ఈ ఇల్లు వేలం వెయ్యడానికి వీల్లేదు- దీని మీదున్న బాకీ అంతా నేను కట్టేస్తాను-" అంటూ అతను బ్రీఫుకేసు ఓపెన్ చేసి నోట్ల కట్టలు చూపించాడు.

పడక్కుర్చీలో నిస్తేజంగా కూర్చున్న దయానిధి ప్రొఫెసరుకు ఆ గొంతు వినగానే ప్రాణం లేచివచ్చింది- " ఎవరది- ఎవరు -గోపాలం గాడేనా?" గట్టిగా కేక పెట్టారు.

" అవును సార్ ! నేను గోపాలం - అమెరికాలో ప్రొఫెసర్ని, మీ దయవలన పైకి వచ్చాను- మీకేం దిగులు అక్కరలేదు- ఈ యిల్లు ఎక్కడికీ పోదు - ఎన్ని లక్షలు ఖర్చయినా మీ ఆశయాలు నడుస్తాయి" అంటూ ఆయన పాదాలను కళ్ళకు అద్దుకున్నాడు.

" వద్దు గోపాలం - జీవితంలో చాలా కష్టపడి పైకి వచ్చావు. ఏదో నాలుగు రాళ్ళు ఎనకేసుకుని హాయిగా ఉన్నావు- నాకోసం కష్టాల పాలు కావద్దు. ఈ ఇల్లు శాశ్వతం కాదు- మన శరీరమే శాశ్వతం కాదు - కాని నా దిగులు అది కాదు - నా వయసు అయిపోయింది ఇంక ఎక్కువ కాలం బ్రతకనని అనిపిస్తున్నది- నా తర్వాత ఈ పిల్లల్ని ఎవరు చూస్తారన్నదే నా బాధ!" కన్నీటితో చెప్పాడు.

" నాయనా గోపాలం ! ఈయన వరస ఇది. పిల్లల్ని అడిగితే వాళ్ళ దగ్గరికి వచ్చెయ్యమంటారు. ఈ అనాథల్ని వదిలేసి ఇద్దరం నలిగిపోతున్నాం. అటు కన్న

మమకారాలు లేమి - జరుగుబాటుకు సహకారం లేదు. ఆయన కున్న దిగులల్లా తన ఆశయాలకు వారసులు లేకుండా పోయారన్నదే!" బాధగా చెప్పింది దయానిధి భార్య కన్నీరు తుడుచుకుంటూ.

" అమ్మా అంతమాట అనకండి. నేను మీరు వెలిగించిన దీపాన్ని. ఈ దీపం మరికొన్ని దీపాలను వెలిగిస్తుంది. ఆ రోజు అనాథగా మిగిలి- చిల్లర దొంగతనాలు చేస్తూ జీవితాన్ని పాడు చేసుకొన్నప్పుడు - నాకు క్రొంగొత్త జీవితాన్ని ప్రసాదించిన గురువుగారు ఈయన. అందుకే నేను అమెరికాలో ఉన్నా నా మనసు యిక్కడే ఉంది. ఈ ఆశ్రమం యిలానే కొనసాగే ఏర్పాటు నేను చేస్తాను. దీనిలో నా సహకారమే కాదు - నాలాంటి వారి శిష్యుల సహకారం కూడా ఉంటుంది." అని చెప్పి గోపాలం వేలం వేసే ఆఫీసర్ల దగ్గరకు వెళ్ళాడు.

" చూడండి రామ్మూర్తిగారు ! వీరంతా నన్ను ఎలా రుణగ్రస్తుడ్ని చేస్తున్నారో!" అంటూ భోరున విలపించాడు దయానిధి.

రామ్మూర్తికి ఇంకా అర్థం కాలేదు- జరుగుతున్నది కలా - వైకుంఠ మాటా అని. శీను- జానీ రామ్మూర్తి వంక ఎగాదిగా చూశారు. జీవితంలో రాబడికీ కాదు పోబడికి కూడా అర్థం ఉంటుందన్నట్లున్నాయి వారి చూపులు. రామ్మూర్తికి జీవిత పరమార్థం గోచరించింది. పండుటాకులా రాలి పోతున్న జీవితం కూడా కొత్త ఊపిరులు పోస్తుందని అర్థం అయింది. జీవితసాఫల్యం అంటే ఏంటో తెలిసింది.

- జాగృతి 23-11-2009